క్లుప్తంగా

మార్మోగిన జయహో భారత్ నినాదం



భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

ఒంగోలు: జయహో భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక భాగ్యనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు బుధవారం 1000 మీటర్ల జాతీయ జెండాతో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పాఠశాల వద్ద నుంచి చర్చిసెంటర్ వరకు, తిరిగి పాఠశాల వరకు దాదాపు రెండు కిలోమీటర్లకుపైగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముందువైపు జాతీయ నాయకుల ఫొటోలను విద్యార్థులు ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జయహో భారత్ అంటూ విద్యార్థుల నినాదాలు మార్మోగాయి. ట్రాఫిక్ ఏఎస్సై వినోద్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో దేశం పట్ల, మహనీయుల పట్ల భక్తిభావం, స్ఫూర్తి పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, డీన్ శివ, ప్రైమరీ, ప్రీప్రైమరీ ఇన్‌చార్జులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కేరళ ఆయుర్వేద సిబ్బంది

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని కేరళ ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ అనబ్, డాక్టర్ అతీరా కొతీరి ఆధ్వర్యంలో ఓనం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అనిబ్ మాట్లాడుతూ మనం సంక్రాంతికి ఎంత ప్రాముఖ్యత ఇస్తామో అలాగే కేరళ రాష్ట్రంలో ఆగస్టు నెల శ్రావణమాసం పౌర్ణమికి ముందు పదిరోజులు ఓనం పండుగను వేడుకగా నిర్వహిస్తారని తెలిపారు. అసుర రాజు మహాబలి పాతాళంలో నుంచి భూమి మీదకి వచ్చిన సందర్భంగా ఈ ఓనం పండుగను విశేషంగా జరుపుకుంటారని తెలిపారు. వైద్యశాల ఆవరణలో పూలతో ఏర్పాటు చేసిన దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హాస్పిటల్ సిబ్బంది ఓనం సంప్రదాయ దుస్తులతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

గిరిజన కుటుంబానికి సరుకులు అందజేత



బియ్యం, సరుకులు అందజేస్తున్న దృశ్యం

అల్లూరు (కొత్తపట్నం): గిరిజన కుటుంబానికి మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం సరుకులు అందజేశారు. ఆకుల అల్లూరు గ్రామంలో రామలింగారెడ్డి యానాది కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధురాలు మాణిక్యాల మస్తానమ్మకు అల్లూరులోని మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ వారు రైస్ బ్యాగ్, సరుకులు పంపిణీ చేశారు. దాతలు కృష్ణ, శిశారెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు సహాయం చేశారు.

డాక్యుమెంట్ రైటర్ల సమ్మె

చీమకుర్తి/ఒంగోలు సబర్బన్ : కారు ప్రైమ్-2.0 రిజిస్ట్రేషన్ల నిమిత్తం ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్టుకు నిరసనగా 0డాక్యుమెంట్ రైటర్లు బుధ, గురువారాలు రెండురోజుల పాటు సమ్మె చేపట్టడంతో బుధవారం మొదటిరోజు ఒంగోలు, సంతనూతలపాడు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. ఆయా కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్లు నినాదాలు చేశారు. సంతనూతలపాడులో సబ్ రిజిస్ట్రార్ ఇస్మాయిల్ షరీఫ్‌కు స్థానిక డాక్యుమెంట్ రైటర్లు వినతిపత్రం అందించారు

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

- టీడీపీ నాయకులను హెచ్చరించిన వైఎస్సార్ సీపీ నాయకుడు జుబేర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు జుబేర్

ఒంగోలు: టీడీపీ నాయకులు వారి గొప్ప కోసం ఇతరులను ఏకవచనంతో సంబోధించడం, వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ నాయకుడు జుబేర్ హెచ్చరించారు. గొప్పలనేవి మన సంస్కారంలో ఉట్టిపడాలని, మాటల్లో కాదని హితవుపలికారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింల జీవితాల్లో వెలుగులు రావాలంటే రిజర్వేషన్ ఫలాలు ఒక్కటే మార్గమని భావించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ మేరకు చర్యలు చేపట్టారన్నారు. అందువలనే తామంతా విశ్వాసంతో ఉన్నామన్నారు. వైఎస్సార్ ఆశయాల సాధన దిశగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని వాసన్నకు అండగా ఉన్నామన్నారు. నేడు ముస్లింలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను పైసా ఖర్చులేకుండా అందిస్తున్నారని కొనియాడారు. అందుకోసం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలే కారణమన్నారు. కరోనా సమయంలో పేద ముస్లింలను ఆదుకునేందుకు బాలినేని పడిన తపన అంతా ఇంతా కాదని గుర్తుచేశారు. ఆయన స్వయంగా సొంత డబ్బు వెచ్చించి తమతో కూడా పనిచేయించారన్నారు. కానీ, కరోనా సమయంలో అడ్రస్ కూడా లేని టీడీపీ నేతలు.. నేడు వారి మనుగడ కోసం పాకులాడుతున్నారని, ముస్లింలు ఈ విషయం తెలుసుకోవాలని అన్నారు. తమ నేత తమకు సంస్కారం నేర్పించారని, అందువల్లే మాజీ ఎమ్మెల్యేను సైతం తాము ఏకవచనంతో సంబోధించడం లేదని అన్నారు. కానీ, కరిముల్లా అనే వ్యక్తి కేవలం టీడీపీలో ప్రాపకం కోసం బాలినేనిని వ్యక్తిగతంగా విమర్శించడం, ఏకవచనంతో సంబోధించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది పునరావృతమైతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ నాయకులను హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హబీబ్, షేక్ సైదా, నాలుగో డివిజన్ అధ్యక్షుడు షేక్ కాలేషా, నాయక్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



రాఖీ పండుగ సందర్భంగా పలువురు మహిళలు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు

క్రీడా ప్రణాళికలు రూపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 వెంకారెడ్డి

చీమకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల నిర్వహణకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంఈఓ-2 వెంకారెడ్డి, నియోజకవర్గ స్థాయి కాంప్లెక్స్ కో ఆర్డినేటర్ బీ శ్రీనివాసరెడ్డి పీడీలు, పీఈటీలకు సూచించారు. వ్యాయామోపాధ్యాయులకు సంబంధించిన స్కూలు కాంప్లెక్స్ సమావేశాన్ని బుధవారం సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు సబ్జెక్టులకు సంబంధించిన స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను మాత్రమే నిర్వహించేవారని, ఇప్పుడు వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం వలన క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించుకోవడానికి దోహదపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో స్కూలు గేమ్స్ రిజిస్ట్రేషన్లు చేయడంలో అవసరమైన సూచనలు అందించారు. అవసరమైన విధివిధానాలను రూపొందించడంలో స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూళ్ల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఎస్సై అభ్యర్థుల ఈవెంట్స్‌ను పర్యవేక్షించిన ఎస్పీ



పర్యవేక్షిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసుశాఖ గుంటూరు రేంజ్ పరిధిలోని ఎస్సై మహిళా అభ్యర్థులకు గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్లో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలను బుధవారం జిల్లా ఎస్పీ మలికాగర్గ్ పర్యవేక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షలను గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజు, ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానతో కలిసి ఎస్పీ పర్యవేక్షించారు.

గుండ్లకమ్మ నుంచి ఎస్ఎస్ ట్యాంకులకు నీరు

- అమృత్-1 పథకంలో భాగంగా సరఫరా
- ఇటీవల పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని



ఎస్ఎస్ ట్యాంకుకు వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: గుండ్లకమ్మ జలాశయం నుంచి ఒంగోలు నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు (ఎస్ఎస్) వస్తున్న నీటి సరఫరాను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి అమృత్-1 పథకంలో పనులు పూర్తయిన సందర్భంగా ఇటీవల మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. గుండ్లకమ్మ నుంచి వచ్చే నీటిని ముంగమూరు గ్రామ పరిసరాల్లో సాగర్ కాలువకు అనుసంధానం చేశారు. నీటి విడుదలను నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకులకు గుండ్లకమ్మ నుంచి వచ్చే మంచినీటిని సరఫరా చేసే విధానాన్ని పర్యవేక్షించారు. సాగర్ ఫీడర్ కెనాల్స్‌కు వెళ్లే కాలువల్లో మెష్‌లకు అడ్డుగా ఉన్న చెత్తా, చెదారాలను ఒంగోలు నగర పాలక సంస్థ సిబ్బందితో తొలగించేలా చూశారు. ఎస్ఎస్ ట్యాంక్-1 లో గరిష్ట నీటినిల్వ 1950 మిలియన్ లీటర్లకి గాను ప్రస్తుతం 677.40 మిలియన్ లీటర్లు నిల్వ ఉందని కమిషనర్ తెలిపారు. ఎస్ఎస్ ట్యాంక్-2లో గరిష్ట నీటి నిల్వ 3750 మిలియన్ లీటర్లకు ప్రస్తుతం 1085.63 మిలియన్ లీటర్ల నీటి నిల్వ ఉందన్నారు. మొత్తం కలిపి 5800 మిలియన్ లీటర్లకు గాను ప్రస్తుతం 1763.03 మిలియన్ లీటర్లు నిల్వ ఉందని చెప్పారు. ఒంగోలు నగరంలోని రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిండే వరకూ నీరు విడుదల చేస్తామని పేర్కొన్నారు. నీరు విడుదలవుతున్న ప్రతి రోజూ ఒంగోలు నగర పాలక సంస్థ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎస్ఎస్ ట్యాంకు-2ను, ఏపీ గ్రీనరీ అండ్ పునర్వ్యవస్థీకరణ పనులను ఆయన పరిశీలించారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కమిషనర్‌తో పాటు ఎంఈ కే.మాల్యాద్రి, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు తనిఖీ



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాసరావు

కొత్తపట్నం: మండలంలో ఈ-క్రాప్ నమోదును జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపట్నం, రాజుపాలెం, గమళ్లపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సాగుచేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. పైరుకు ఆశించిన తెగుళ్ల, లద్దె పురుగు నివారణ మార్గాలను రైతులకు వివరించారు. ఈ క్రాప్ నమోదు ఎన్ని ఎకరాల్లో పూర్తయిందో వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ-క్రాప్ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ సభలు, సామాజిక తనిఖీలకు రైతు జాబితాలను ఆర్‌బీకేల్లో ఉంచాలని, సెప్టెంబర్ 30న ఫైనల్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం నుంచి వచ్చిన టెక్నికల్ ఏవో శ్రీనివాస నాయక్, మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు శ్రావణ్, కల్పన, రవి, మృదులత, రైతులు పాల్గొన్నారు.

రొయ్య తలకాయ ప్రాసెసింగ్ ప్లాంటుపై చర్యలు తీసుకోండి

సింగరాయకొండ: స్థానిక ఊళ్లపాలెం రోడ్డులోని రొయ్యల తలకాయల ప్రాసెసింగ్ ప్లాంటు సెవన్ హార్స్ కంపెనీ నుంచి ప్రతిరోజు దుర్గంధం వస్తోందని, వ్యర్థాల నుంచి వచ్చే మురుగు నీరు కూడా వదలటంతో కంపెనీ పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోందని సోమరాజుపల్లి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్న వారు కంపెనీ నుంచి వస్తున్న దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బుధవారం ప్రజలు తహశీల్దార్ సీహెచ్ ఉషకు వినతిపత్రం అందజేశారు.

పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల పరిశీలన

- ఇంటింటికి తిరిగిన ఆర్డీవో విశ్వేశ్వరరావు



ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: పోలింగ్ బూత్‌ల వారీగా డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లను ఒంగోలు రెవెన్యూ డివిజినల్ అధికారి (ఆర్డీవో) విశ్వేశ్వరరావు బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. నగరంలోని 22వ డివిజన్ దక్షిణం బజార్, వేణుగోపాలస్వామి దేవస్థానం రోడ్డు, శ్రీగిరి కొండమార్గంలోని 153, 154 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలించారు. డబుల్ ఓట్లు, మరణించిన వారి వివరాలతో పాటు అడ్రస్‌లు మారిన వారి వివరాలు కూడా తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్ల వివరాలు తెలిపేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు గుర్రం సత్యం, రసూల్, ఎలక్షన్ డీటీ రఫీ, బీఎల్ఓ, బీఎల్ఏలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులను కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. తొలుత అధికారులతో సమీక్షించారు. అనంతరం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఒంగోలు నగరం బ్యూటిఫికేషన్‌లో భాగంగా కర్నూల్ రోడ్డులోని పేర్నమిట్ట వద్ద రెడ్డిపాలెం సమీపంలో రోడ్డు మధ్యలో డివైడర్‌లో మొక్కల పెంపకం కోసం తోలుతున్న మట్టి నాణ్యతను పరిశీలించారు. మొక్కల పెంపకానికి అనువైన మట్టిని మాత్రమే డివైడర్లలో తోలాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎన్‌క్యాప్ నిధుల ద్వారా చేపడుతున్న డివైడర్ల లోపల గ్రీనరీ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎక్కడా రోడ్డుపై మట్టి వదిలేసి వెళ్లవద్దని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నగరంలో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు, మరమ్మతులపై ప్రతి వారం సీడీఎంఏ వీడియో సమావేశంలో సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. కాంట్రాక్టర్లకు బిల్లులన్నీ చెల్లించడం జరిగిందన్నారు. అదేవిధంగా నగరంలో చెత్త సేకరణలో మూడు బుట్టల విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు కమిషనర్ సూచించారు. గొడుగు సంజీవబజార్‌లో చెత్త సేకరణ, మురుగునీటి పారుదల తీరును పరిశీలించారు.

3న ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు అర్బన్: వచ్చే నెల 3వ తేదీ దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం మెడికల్ క్యాంపును స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూల్లో నిర్వహించనున్నట్లు మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకట్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే మెడికల్ క్యాంపులో బీపీ, సుగర్, పక్షవాతం, ఫిట్స్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి తక్కువ ధరకు మందులివ్వనున్నట్లు చెప్పారు. నూరాలజిస్ట్ గోపాళం శివన్నారాయణ, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, జనరల్ మెడిసిన్ ఎల్.జాన్ రిచర్డ్స్, ఎస్. దీరజ్, సందీప్ ప్రకాష్, పి.చైతన్య, ఎం.రవితేజ, జీవీ సుబ్బారెడ్డి పాల్గొని వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు రెండు రోజులు ముందుగా సుగర్, బీపీ పరీక్షలు చేయించుకుని రావాలని తెలిపారు. వైద్య శిబిరంలో రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200కు ఇవ్వడంతో పాటు తక్కువ ధరకు ఇన్సులిన్ కూడా అందజేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్న యువనేతలు

కొత్తపట్నం: మండలంలోని అల్లూరు గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, మాగుంట రాఘవరెడ్డి గురువారం సాయంత్రం 3.30 గంటల నుంచి పరిశీలించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు మెంబర్లు, వైస్ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన పోలేరమ్మ తల్లి విగ్రహం

చీమకుర్తి: మండలంలోని గాడిపర్తివారిపాలెంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోలేరమ్మ, పోతురాజు సింహవాహన ప్రతిష్ఠ వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో హోమాలు నిర్వహించి ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డితో పాటు చీమకుర్తి మండలంలోని పలు గ్రామాల నుంచి పలువురు నాయకులు, భక్తులు, గ్రామానికి చెందిన భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.